క్లుప్తంగా

28న మద్ది ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 28న చంద్ర గ్రహణం సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 1 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తామని, తిరిగి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఆలయం తలుపులు తెరిచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

28న పారిజాతగిరి ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం: ఈ నెల 28వ తేదీ శనివారం పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా పారిజాత గిరి ఆలయం మూసివేయనున్నట్టు గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ ఈఓ మానికల రాంబాబు తెలిపారు. శనివారం రాత్రి ఒంటిగంట నుంచి చంద్రగ్రహణం సంభవించనున్న నేపథ్యంలో, అదేరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆలయాన్ని మూసివేయనున్నట్టు పేర్కొన్నారు. తిరిగి ఆదివారం ఉదయం శుద్ధి, సంప్రోక్షణ, అనంతరం పునర్దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణఅధికారి మానికల రాంబాబు తెలిపారు.

ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శన



ఎన్ఆర్ పాలెంలో ఈ-పంట నమోదు జాబితాను రైతులకు వివరిస్తున్న ఏఓ సుమలత

బుట్టాయగూడెం: ఖరీఫ్ సీజన్‌లోని ఈ-పంట నమోదు జాబితాను ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం ఏర్పాటు చేసినట్టు ఏఓ బి.సుమలత తెలిపారు. బుట్టాయగూడెం మండలం నూతిరామన్నపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఈ-పంట నమోదు జాబితాను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే రైతులు ఈ నెల 30లోపు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. వాటిని పరిశీలించిన అనంతరం అగ్రికల్చర్ గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెల 27 నుంచి రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సభల్లో రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. శుక్రవారం 10 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. మిగిలిన 8 రైతు భరోసా కేంద్రాల్లో శనివారం గ్రామ సభలు ఉంటాయని చెప్పారు. ఈ సభల్లో తప్పనిసరిగా రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ పి.నాగదుర్గ, రైతులు ఎం బజారు, బి.లాజరు, ఎం రాముడు, ఎం స్వామి, టి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ పంట నమోదు, ఈ కేవైసీ చేయించిన రైతుల వివరాలను, ఆయా రైతు భరోసా కేంద్రాలు, సచివాలయంలో ఉంచినట్టు తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే అక్టోబర్ 30లోపు ఫిర్యాదు చేసుకోవచ్చిన వివరించారు.

గాజుల అలంకరణలో గంగానమ్మ



గాజుల అలంకరణలో గంగానమ్మ

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక తూర్పువీధిలోని గంగానమ్మ ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవ మూర్తిని గాజులతో అలంకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజాధికాలు జరిపి, హారతులిచ్చారు. అలాగే నివేదనను సమర్పించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు అందులో పాల్గొని భక్తి ప్రపత్తులతో అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజలకు ఉపయోగపడే పనుల ఎంపిక

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు, రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడే పనులను ఎంపిక చేశామని ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరదరామ్‌జీ అన్నారు. గురువారం మేధినరావుపాలెంలో సర్పంచ్ మనుబోలు వెంకట కనకదుర్గరాజు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు కచ్చితంగా ఉపాధి పనులు కల్పించడంతో పాటు పారదర్శకంగా పనుల కల్పన, ఉపాధి హామీ పథకం బాధ్యత అన్నారు.

మోహిని అలంకారంలో శ్రీవారి దర్శనం



సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధులకు పయనమైన శ్రీవారు



స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



మోహిని అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల క్షేత్రంలోని శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామివారు గురువారం ఉదయం సూర్యప్రభ, కల్యాణ వేడుక అనంతరం రాత్రి వెండి గరుడ వాహనాలపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. కల్యాణ మహోత్సవానికి ముందు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిత్య కల్యాణ మండపంలో ఉదయం అర్చకులు అట్టహాసంగా నిర్వహించారు. మోహిని అలంకారంలో శ్రీవారు ఆలయ ముఖ మండపంలో భక్తులకు దర్శనమిచ్చారు. – ద్వారకాతిరుమల



స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు తోడ్కొని వస్తున్న అర్చకులు, భక్తులు

28న జంగారెడ్డిగూడెంలో భారీ బహిరంగ సభ

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నాటికి 200వ రోజుకు చేరుకుంటున్న నేపథ్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించే భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 28వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటలకు గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి గుడి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభమై స్థానిక గంగానమ్మ గుడి వద్ద వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగుతుందని చెప్పారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ అచ్చిరాజు, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, నాయకులు బత్తిన చిన్న, వందపు వెంకటేశ్వరరావు, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు చనమాల శ్రీనివాస్, గురజాల పార్థసారథి, కౌన్సిలర్‌లు, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

బహిరంగ సభకు తరలిరావాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 28న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు కోరారు. ఆరోజు మధ్యాహ్నం నిర్వహించే భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పేర్కొన్నారు.

అమ్మవారి లడ్డూ వేలం



లడ్డూ ప్రసాదం దక్కించుకున్న భక్తుడు కొండలరావు

కొయ్యలగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మవారికి సమర్పించిన 18 కేజీల లడ్డూకు పాలకమండలి కమిటీ సభ్యులు వేలం పాట నిర్వహించారు. పరింపూడి ఉపసర్పంచ్ సంకు కొండలరావు రూ.25 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. పాలకమండలి కమిటీ చైర్మన్ సోమరాజు నేతృత్వంలో సభ్యులు ప్రసాదాన్ని భక్తుడికి అందజేశారు.

గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు కృషి

ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: మారుమూల అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న కొండరెడ్డి గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం సూర్యతేజ అన్నారు. బుట్టాయగూడెం మండలంలోని అటవీప్రాంతంలోని మారుమూల ప్రాంతమైన గోగుమిల్లి గ్రామాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమై అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతోన్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలో డ్రాప్‌ఔట్ విద్యార్థుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. డ్రాప్‌ఔట్ విద్యార్థులు ఉంటే వారిని తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపించే విధంగా చూడాలని కోరారు. రేషన్ బియ్యం అందుతోందా ? పింఛను సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి సమస్యలను తెలియజేయాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ అన్నివేళలా కృషి చేస్తోందని వివరించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గోగుమిల్లి గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

వైఎస్సార్ సీపీలోకి మద్దిపాటి మాధవ్

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రతిపక్ష నాయకులు సైతం కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం అచ్యుతాపురం గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ మద్దిపాటి మాధవ్ ఎమ్మెల్యే బాలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవ్‌కు ఎమ్మెల్యే బాలరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మాధవ్ లాంటి యువనేత రావడం అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆకాంక్షించారు. మాధవ్ గతంలో కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడిగా, టీడీపీ మండల యువజన అధ్యక్షుడిగా వ్యవహరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల యూత్ అధ్యక్షుడు యడ్లపల్లి సురేష్, అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు కమిటీ చైర్మన్ గంట రాంబాబు, మండల విప్ గంట శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బాజీ, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దూలపల్లి కాంతారావు, సర్పంచుల చాంబర్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.చిన్న తుక్కయ్య, మారిశెట్టి శ్రీనివాస్, చిటికెన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మాధవ్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆర్డీఓ అద్దయ్యకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రంగారావు

జంగారెడ్డిగూడెం రూరల్: అంజనేయస్వామి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం పర్వదినం కావడంతో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో గురువారం సువర్చలా హనుమద్ కల్యాణం అర్చకులు, వేద పండితులు నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. స్వామి వారి మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు పాల్గొన్నారు.

అంజన్న సేవలో ఆర్డీఓ

జంగారెడ్డిగూడెం ఆర్డీఓగా గురువారం బాధ్యతలు చేపట్టిన కె.అద్దయ్య గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామివార్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు కురగంటి రంగారావు ఆర్డీఓకు స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

పెదవేగి: ప్రజల ఆరోగ్య పరిరక్షణ జగనన్న ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. పెదవేగి మండలంలోని కొండలరావుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ పాలడుగు సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఎంపీపీ తాతా రమ్య పాల్గొన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పద్మశ్రీ అన్నారు. కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తి స్థాయి ఆరోగ్యాన్ని అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని తెలిపారు.

పథకాలతో ప్రతి కుటుంబానికీ మేలు

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం గుంజవరం, రామన్నపాలెం, గార్లగొయ్యి, కొత్తతోటగొంది, బోడిగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఆయన గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. నవరత్నాల అమలుతో ప్రజలు సంతృప్తి కరంగా ఉన్నారని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రానుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు అండగా నిలవాని కోరారు. అర్హత ఉండి పథకాలు రానివారికి పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని బాలరాజు అధికారులను ఆదేశించారు. సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు మంజూరవుతాయని, వాటితో ఆ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సీఎం జగన్ విద్య, వైద్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, ఎంపీటీసీలు దాపర్తి మోహన్‌రావు, కుంజం చిట్టెమ్మ, వింజరం సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, నాయకులు సున్నం గంగాజలం, ఎంపీడీఓ జి.శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు, ఏపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఎం బి.శ్రీను తదతరులు పాల్గొన్నారు.



గార్లగొయ్యిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య విప్లవం

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య విప్లవం అమలవుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం గవరవరం జెడ్పీ హైస్కూల్లో ఎంపీడీఓ ఆర్.బీబీశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు కలుగుతున్న వైద్య చికిత్స, సౌకర్యాలను వివరించారు. ఈ పథకం విజయవంతమవడంలో అధికారుల పాత్ర ప్రజాప్రతినిధుల కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా రోగులకు మందులు అందజేశారు. విద్యార్థినులకు కళ్లజోళ్లు అమర్చి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ప్రారంభించారు.



కొయ్యలగూడెం : గవరవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలరాజు

ఆర్బీకే ప్రారంభం

గవరవరం గ్రామంలో రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలరాజు ఏడీఏ పీజీ బుజ్జిబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. భవనంలోని వివిధ బ్లాక్‌లను, శిలాఫలకాలను జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావులతో కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పాసం నాగమణి, ఎంఈఓ జె.సురేష్ బాబు, ఐసీడీఎస్ పీఓ యుఎన్ స్వర్ణకుమారి, పార్టీ గ్రామ కన్వీనర్ శీమకుర్తి సత్యనారాయణ, ఏఓ చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, పార్టీ నాయకులు విగ్గిన రామకృష్ణ, కసుకుర్తి వేణు, గంటా రమేష్, బిరుదుగడ్ల ప్రేమ్ కుమార్, బీఎస్ఆర్‌కే శ్రీను, గారపాటి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు కవచం

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు రక్షణ కవచం వంటిదని ఎంపీడీఓ మురళీకృష్ణ అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ వెలగలపల్లి సచివాలయం పరిధిలో గురువారం సర్పంచ్ టి.భూపతి అధ్యక్షతన జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కిరణ్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలా, సర్పంచ్ తొమ్మండ్రు భూపతిరావు, ఉప సర్పంచ్ ఎస్ రమేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



చింతలపూడి : ఫాతిమాపురంలో వృద్ధుడికి ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం

గోమాతకు పూజలు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణానికి ఉత్తరాన కొలువైయున్న శ్రీ చక్ర సహిత నూకాలమ్మమ్మ వారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద అర్చకులు గోమాతకు పూజలు చేశారు. ఈ నెల 28 సాయంత్రం ఆలయ యాగశాల వద్ద కళ్యాణార్థం 56వ చండీ హోమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవ బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గోమాతకు పూజ చేస్తున్న దృశ్యం

అమ్మవారి శేషవస్త్రాల వేలం

జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మవారి అలంకరణకు వినియోగించిన చీరలతో పాటు, భక్తులు సమర్పించి, పూజలో ఉంచిన చీరలను వేలం వేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శేషవస్త్రాలను కొనుగోలు చేశారు.

డీఎల్‌పీఓ లక్ష్మికి సత్కారం

దెందులూరు: డీఎల్‌పీఓగా పదోన్నతి పొందిన దెందులూరు ఎంపీడీఓ ఏవీపీవీ లక్ష్మి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్, ఎంపీటీసీ సభ్యులు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు అన్నారు. గురువారం గోపన్నపాలెం సచివాలయంలో లక్ష్మిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.